# ప్రత్యేకత

కొంతమంది ఎంతమందిలో ఉన్నా ఎంతో ప్రత్యేకంగా కన్పిస్తారు... అందరి అటెన్షన్‌కీ, ఆకర్షణకీ కేంద్ర బిందువవుతారు!

అందుక్కారణం... వాళ్ళ అందమో.... అలంకరణో కాదు... వాళ్ళ విలక్షణమైన వ్యక్తిత్వం !

మనిషికి తనకంటూ ఓ ప్రత్యేకత లేకపోతే అతడు 'మనుషుల సమూహం' లో ఒకడై పోతాడే తప్ప.... ఏ వ్యక్తీ అతణ్ణి ప్రత్యేకంగా గుర్తుంచుకోడు !

అందుకే... ప్రతి వ్యక్తీ తనదైన 'ఇమేజ్' కోసం తాపత్రయపడ్తాడు.

సంగీతంలో, సాహిత్యంలో, చిత్రలేఖనంలో, ఆటపాటల్లో, మేధస్సులో ఇంకా అనేకమైన ఇతర రంగాల్లో ఒక్కో వ్యక్తికీ ఒక్కో ప్రత్యేకత ఉంటుంది !

కాని... మనకి ప్రత్యేకతలెన్నున్నా.. మన ప్రవర్తన 'లేకి'గా ఉంటే... పంటికింది రాయిలా ఎదుటి వాళ్ళనది బాధిస్తుంది!

అయితే...

'ప్రత్యేకత' అనేది పువ్వుకి పరిమళం అబ్బినట్లు.... సహజంగా మనిషి వ్యక్తిత్వంలో అంతర్లీనంగా దాగి... ఆ వ్యక్తి చేసే ప్రతీ పనిలో ప్రతిబింబించాలి.

మాటల్లో, చేతల్లో, నడకలో, నవ్వులో ఎవరి శైలి వారిదే అయినా కొంతమంది వ్యక్తులు వేసే ప్రతి అడుగులో ఎక్కడో ఓచోట అలవోకగా తొంగిచూసే లాలిత్యం, హుందాతనమే నల్గుర్లో వాళ్లకో ప్రత్యేకత తెచ్చిపెడ్తుంది !

పోతే మన ఫీల్డ్‌లో మనమే గొప్పకదా అని... కన్నూమిన్నూ కానకుండా... ఎవర్నీ లెక్క చేయకపోతే... ఎదుటివాళ్ళు మన ప్రత్యేకతని నోటితో మెచ్చుకుని నొసటితో వెక్కిరిస్తారు !

అయితే ....

ఎన్ని ప్రత్యేకతలున్నా.... వినమ్రత లేని మనిషిని ఎవరూ అభిమానించలేరు !

కొందరి కంటికి...

'కాకుల మధ్య కోకిల' కి-ఏ ప్రత్యేకత కన్పిస్తుందో...

'కోయిలల మధ్య కాకి' కీ - అదే ప్రత్యేకత కన్పిస్తుంది!

అఫ్‌కోర్స్.... ఎవరి ప్రత్యేకత వాళ్ళదే అయినా ఆ ప్రత్యేకతల్లో తేడా ఉంటుంది! కాకుల మధ్య కోకిల 'ఓహో' అన్పించుకుంటే... కోయిలల మధ్య కాకి 'అయ్యో' అన్పించుకుంటుంది.

అందుకే...

ప్రత్యేకత పేర మనిషి నల్గుర్లో 'భేష్' అన్పించుకోవాలే తప్ప.... ఏదో ఒక ప్రత్యేకత ఉంటే చాలనుకుని... ఏ ఖల్‌నాయకుడో ఐ.... అందర్తో 'ఛీ' కొట్టించుకోకూడదు !

01-03-1995